న్యూస్‌రీల్

తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో స్రవంతి

నిర్మల్‌చైన్‌గేట్: పారదర్శకమైన ఓటరు జాబితాను రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ నియోజకవర్గ ఓటరు జాబితా నమోదు అధికారి, ఆర్డీవో బి.స్రవంతి కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీ ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన జాబితాలో ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటిని తనిఖీ చేసి వాటిలో ఏవైనా ఇంటి నంబర్ల మార్పు ఉంటే సరిచేయడం జరిగిందన్నారు. క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ ఫారం 6, 7, 8 పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జాబితాను తప్పులు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా తయారుచేయాలన్నారు. సమావేశానికి తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు పరిశీలన



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఎస్ఈ

ఖానాపూర్: పట్టణంలో రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా చేపట్టిన విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియను విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్ గురువారం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండలంలోని గోసంపల్లె, ఖానాపూర్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. మండలంలో విద్యుత్ బకాయిలు త్వరగా వసూలు చేయాలన్నారు. ఆయన వెంట ఏడీఈ శ్రీనివాస్, ఏఈ తిరుపతి, సబ్ ఇంజినీర్ వెంకటేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్



సూచనలు చేస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: విత్తన, ఎరువుల డీలర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే వానాకాలం కోసం అందరూ సిద్ధం కావాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విధిగా స్టాక్ రిజిస్టర్ నిల్వబోర్డులు ప్రదర్శించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు అందజేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యక్తులపై సమాచారం ఉంటే బాధ్యతగా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎరువులు అమ్మే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈపాస్ యంత్రం ద్వారానే అమ్మకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు రాజేశ్వర్, రమేశ్, మహాజన్, భీమ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 20 రోజులుగా ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐడీడబ్ల్యూఏ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐకేఎస్ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్, సునీత, సుమలత, గంగామణి, సుజాత, సునంద, గాయత్రి, స్రవంతి, గోదావరి, సింధుజ, కృష్ణవేణి, మౌనిక, లలిత, రజిని ఎస్.సునీత, సంధ్య, రాణి, సాయన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగ.. మీటరు గిరగిరా



- 24 గంటలూ పనిచేస్తున్న ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

నిర్మల్ ఖిల్లా: భానుడు ఉగ్రరూపం దాల్చాడు. ఉదయం 8 గంటల నుంచే నిప్పులు కక్కుతుండటంతో జనం వేడి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బయటకు వెళ్లేందుకు కూడా జంకుతున్నారు. దూర ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కన్నా మూడు నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో వేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు 24 గంటలూ వాడుతున్నారు. ఫలితంగా ఇంట్లో కరెంట్ మీటరు గిరగిరా తిరుగుతోంది. కేవలం వ్యక్తిగత వినియోగం మాత్రమే కాదు నిర్మల్ జిల్లా సగటు విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయిలో నమోదవుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో గృహ విద్యుత్ వినియోగం కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. గ్రామాలతో పోల్చితే పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో కరెంటు వినియోగం అధికంగా వినియోగిస్తున్నారని విద్యుత్ అధికారులు అంటున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా..

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయంగా గృహ వినియోగదారులకు కరెంటు సరఫరా చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. వేసవి తీవ్రతతో వాడకం అధికంగా ఉన్నా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

3.5 లక్షల విద్యుత్ కనెక్షన్లు..

గృహ, పారిశ్రామిక, వ్యవసాయరంగాలకు కలిపి జిల్లాలో 3.5 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రోజువారీ విద్యుత్ వినియోగం సాధారణ రోజుల్లో 3.8 మిలియన్ యూనిట్ల నుంచి 4 మిలియన్ యూనిట్ల వరకు ఉంటుంది. వేసవి, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రస్తుతం రోజువారీ విద్యుత్ వినియోగం 4.5 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఏప్రిల్‌లో 4.2 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుతం మరో 0.3 యూనిట్ల వినియోగం పెరిగింది. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా విద్యుత్ బిల్లు కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంది. అయినా వేడి నుంచి ఉపశమనం కోసం తప్పడం లేదంటున్నారు. ఈనెలాఖరు వరకు ఇదే పరిస్థితి ఉంటుందంటున్నారు.

గడిచిన ఆరు రోజులుగా జిల్లాలో విద్యుత్ వినియోగం

తేదీ	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)
12	4.2
13	4.2
14	4.5
15	4.5
16	4.5
17	4.5

పొదుపుగా వాడుతున్నాం



వేసవితాపం పెరిగిపోతుండడంతో రోజురోజుకూ విద్యుత్ వాడకం ఎక్కువవుతోంది. అయినా దుకాణంలోకి వచ్చే కస్టమర్ల గిరాకీని అనుసరించి అందరి ఒకేసారి జిరాక్స్ ప్రతులను తీస్తున్నా. తద్వారా విద్యుత్ వినియోగాన్ని సాధ్యమైనంత ఆదా చేస్తున్నా. కంప్యూటర్, జిరాక్స్ మిషన్, ఫ్యాన్ల వంటి విద్యుత్ పరికరాలను అవసరం మేరకే వాడుతున్నా.
– కదారి గణేశ్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు, నిర్మల్

పొదుపుగా వాడాలి..



విద్యుత్ వినియోగానికి సరిపడా సరఫరా ఉన్నప్పటికీ పొదుపుగా వాడాలి. నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించుకోవాలి. వ్యవసాయ క్షేత్రాల్లో అనవసరంగా పంపుసెట్లను ఆన్‌లో ఉంచకూడదు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఎలక్ట్రికల్ వస్తువులను విధిగా ఆఫ్ చేయాలి. ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగి ఉండాలి.
– జయవంత్‌రావుచౌహాన్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ జిల్లా అధికారి

ఆర్టీసీకి సంధానకర్తలు!



- ఊరికో ఆఫీసర్ నియామకం
- టీఎస్ ఆర్టీసీ సరికొత్త ప్రయత్నం
- 15 రోజులకోసారి గ్రామస్తులతో సమావేశం
- ప్రయాణికులను ఆకర్షించేలా ప్రణాళిక
- మెరుగైన సేవలు, ఆదాయంపై దృష్టి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజారవాణా వ్యవస్థను ప్రజల ముంగిటకు తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికులను ఆకర్షించేందుకు, ప్రజలకు, ఆర్టీసీకి అనుసంధానకర్తలుగా వ్యవహరించేందుకు గ్రామానికో బస్ ఆఫీసర్‌ను నియమించాలని నిర్ణయించింది. ప్రయాణికులకు కల్పిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించి.. టీఎస్ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా విలేజ్‌బస్ ఆఫీసర్ల వ్యవస్థకు రూపకల్పన చేసింది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు బస్ ఆఫీసర్ల వ్యవస్థ ఈనెల 9నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది.

ఒక్కొక్కరికి ఐదు గ్రామాలు...

గ్రామాల్లో నివసించే సంస్థ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులను విలేజ్ బస్ ఆఫీసర్లగా డిపో మేనేజర్లు నియమిస్తున్నారు. నియామకాల్లో ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలుండి.. స్వచ్ఛందంగా పనిచేసేందుకు ముందుకువచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తారు. పెద్ద గ్రామానికి ఒకరు బస్ ఆఫీసర్‌గా ఉంటారు. చిన్నవైతే రెండు, మూడు గ్రామాలకు ఒకరిని నియమిస్తారు. ఒక్కరికి 5 గ్రామాలకు మించి ఇవ్వరు.

నిత్యం అందుబాటులో...

విలేజ్ బస్ ఆఫీసర్లు గ్రామస్తులతో నిత్యం టచ్‌లో ఉంటారు. ఈ బస్ అధికారులు 15 రోజులకోసారి గ్రామస్తులతో సమావేశమవుతారు. బస్సుల రాకపోకలు, సమయాలు, కొత్త రూట్‌లు, కొత్త సర్వీస్‌లు, సమస్యలు, తదితర అంశాల గురించి సమాచారాన్ని సేకరిస్తారు. ఆ సమాచారాన్ని పైఅధికారులకు చేరవేస్తారు. గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, జాతరల వివరాలను వారు సేకరిస్తారు. రద్దీ ఎక్కువగా ఉంటే అందుకు తగ్గట్టుగా బస్ ట్రిప్పులు పెంచుతారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు తమ అద్దె బస్సులను ఉపయోగించుకోవాలని వివరిస్తారు.

నోటీసు బోర్డులో వివరాలు...

ప్రతీ గ్రామపంచాయతీ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో సంబంధిత విలేజ్ బస్ ఆఫీసర్ వివరాలను స్థానిక డిపో మేనేజర్ పొందుపరుస్తారు. అందులో 'బస్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబర్ ఉంటుంది. గ్రామానికి వచ్చే బస్సులకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, రాయితీ పథకాలతోపాటు పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సులను అద్దెకు పొందుటకు విలేజ్ బస్ ఆఫీసర్‌ను సంప్రదించండి.' అని పేర్కొంటారు.

పనికి గుర్తింపు..

మంచిగా పనిచేసే విలేజ్ బస్ ఆఫీసర్లను ప్రోత్సహించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రతీ మూడు నెలలకోసారి పనితీరు బాగున్న వారిని బెస్ట్ విలేజ్ బస్ ఆఫీసర్ అవార్డుతో సత్కరిస్తారు. అలాగే పెళ్లిళ్లకు శుభకార్యాలకు బస్సులను బుక్ చేసి ఇచ్చిన వారికి కమీషన్ కూడా అందజేయనున్నారు.

ప్రజలకు, ఆర్టీసీకి వారధిగా..

గ్రామాల్లో సర్వీస్‌లకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే గతంలో డిపో మేనేజర్లను సంప్రదించేవారు. చాలా గ్రామాలకు డిపో దూరంగా ఉండేవి. శుభకార్యాలకు అద్దె బస్సులను బుక్ చేసుకోవాలన్నా అక్కడికి వెళ్లాల్సి వచ్చేది. విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థతో ఇక ఆ సమస్య చెక్ పెట్టినట్టవుతుంది. ప్రతీ సమస్యను ప్రజలు వారి దృష్టికి తీసుకెళ్లొచ్చు. ప్రజల అవసరాలు తెలియజేయవచ్చు. ప్రజలకు ఆర్టీసీకి అనుసంధానకర్తల్లా ఈ ఆఫీసర్లు పనిచేస్తారు.

జిల్లాలో ఇలా...

ప్రస్తుతం జిల్లాలోని నిర్మల్ డిపో పరిధిలో 72, భైంసా డిపో పరిధిలో 63 పల్లె వెలుగు బస్సులు ప్రయాణికులను నిత్యం గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ప్రస్తుతం నిర్మల్ డిపో పరిధిలో 10 మందిని బస్ ఆఫీసర్లుగా నియమించారు. త్వరలో మరిన్ని దరఖాస్తులు స్వీకరించి ఈ సేవలు మరికొన్ని గ్రామాలకు విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజా రవాణాను ఆదరించాలి..



ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీని ప్రజలు ఆదరించాలి. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకం చేపడుతున్నాం. ఈనెల 9 నుంచి ఈ కార్యక్రమం నిర్మల్ డిపోలో ప్రారంభించాం. విహారయాత్రలు, వివాహాలు, ఇతర రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీని వినియోగించుకోవాలి.
– సాయన్న, డిపో మేనేజర్, నిర్మల్

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మానవహారంగా నిరసన తెలుపుతున్న వీవోఏలు

భైంసాటౌన్: డిమాండ్ల సాధనకు నెలరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల అన్నారు. వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో భైంసాలోని నిర్మల్ చౌరస్తాలో గురువారం మానవహారం చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని బైఠాయించారు. తర్వాత కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వీఓఏలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషన్‌లో 80 సీట్లు, వెల్డర్- 40, డీజిల్ మెకానిక్- 48, ఏసీ టెక్నీషియన్- 24, ఫిట్టర్- 20, డ్రెస్ మేకింగ్ -40 సీట్లు ఉన్నాయని వివరించారు. ధ్రువీకరణ పత్రాలతో iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పల్లె చెంతకు తపాలా సేవలు..



ఈ ఫొటోలోని తపాలా కార్యాలయం కడెం మండలం గంగాపూర్‌లో ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయం లేక ముందు మండలంలోని రానిగూడ, కొత్రతండా ప్రజలు పోస్టల్ సేవల కోసం సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని కడెం లేదా ఖానాపూర్ మండలం భీర్నందికి వెళ్లేవారు. నూతన కార్యాలయం ఏర్పాటుతో రెండు గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గింది.

- మారుమూల గ్రామాల్లో తపాలా కార్యాలయాలు
- గ్రామీణులకు తగ్గిన దూరభారం

కడెం: మారుమూల గ్రామాల్లో తపాలా శాఖ నూతన కార్యాలయాలను ప్రారంభించింది. దీంతో గ్రామీణులకు తపాలా సేవలు అందుబాటులోకి వచ్చాయి. మండల, డివిజన్ కేంద్రాలకు వెళ్లాల్సిన భారం తప్పింది. దీంతో గ్రామీణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

అందుబాటులో సేవలు..

జిల్లాలో మొత్తం ఆరు నూతన తపాలా కార్యాలయాలను ప్రారంభించారు. కుభీరు మండలం సిర్పెల్లి, కడెం మండలం గంగాపూర్, పెంబి మండలం పస్పుల, దోందారి, వెంకంపోచంపాడ్, గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామాల్లో నూతన తపాల కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యాలయాల ద్వారా ఆ గ్రామంతోపాటుగా చుట్టుపక్కల గ్రామాలకు పోస్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకింగ్, బీమా, కొరియర్, ఆసరా పింఛన్, ఉపాధిహామీ డబ్బులు తీసుకునే అవకాశం చేరువైంది. ప్రస్తుతం కార్యాలయాలకు దగ్గరలోని బీపీఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. నూతన కార్యాలయాల్లో సిబ్బందిని నియమించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఇటీవలే ఆరు నూతన పోస్టల్ కార్యాలయాలను ప్రారంభించాం. బీపీవోలకు అదనపు బాధ్యతలు అప్పగించి నూతన కార్యాలయాల్లో సేవలందిస్తున్నాం. బీపీవోల రిక్రూట్‌మెంట్ తర్వాత ఆయా కార్యాలయాలకు పర్మినెంట్ సిబ్బంది వస్తారు. మారుమూల ప్రాంతాల ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
– షఫీయొద్దీన్, ఐపీవో, నిర్మల్

ఎదురుచూసేవాళ్లం



మా గ్రామస్తులు పోస్టల్ సేవల కోసం పెంబి వెళ్లేవారు. ఆసరా పింఛన్, ఉపాధి కూలీలు డబ్బులు తీసుకునేందుకు గ్రామానికి పోస్టల్ సిబ్బంది ఎప్పుడు వస్తారో అని ఎదురుచూసే వారు. ఇప్పుడు మా గ్రామంతోపాటు పక్క గ్రామలకు పోస్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.
– భుక్యా గోవింద్, మాజీ సర్పంచ్, పస్పుల

దూరభారం తప్పింది



గతంలో పోస్టల్ సేవల కోసం మా గ్రామస్తులు కడెం లేదా భీర్నంది వెళ్లేవారు. గంగాపూర్‌లో కార్యాలయం ఏర్పాటుతో మా ఇబ్బందులు తొలగిపోయాయి. కార్యాలయానికి పర్మినెంట్ సిబ్బంది నియమించి పూర్తి సేవలు అందించాలి
– ఉర్వేత ఆనంద్‌రావు, రానిగూడ, కడెం

మెరుగైన సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: పల్లె దవాఖానాల్లో మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమావేశ మందిరంలో జిల్లాలోని పల్లె దవాఖానాల సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో (పల్లె దవాఖానా)జన ఆరోగ్య సమితులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి భారె రవీందర్, డిస్ట్రిక్ట్ డేటా మేనేజర్ ముత్యం, గంగాధర్, సుధాకర్ , ఆరోగ్య పర్యవేక్షకురాలు విమల, జిల్లాలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సాధారణ ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికంగా ఆపరేషన్ కాన్పులు జరుగుతున్న ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఆపరేషన్ ప్రసవాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులకు సూచించారు. ఇకపై నిరంతరంగా ఆసుపత్రులపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ప్రమాదకరం లేని వారు సాధారణ కాన్పు అయ్యేలా చూడాలన్నారు. ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ నిఖిలరాణి, డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

బీజేపీ ఓబీసీ సమ్మేళనంలో జిల్లా నేతలు



ఓబీసీ సమ్మేళనంలో జిల్లా నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నట్లు జిల్లా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి స్వామియాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షుడు దడిగె భోజన్న, ప్రధాన కార్యదర్శి గోస్కుల మల్లేశ్, ఖానాపూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడాల సుధాకర్, ఖానాపూర్ మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల రవి, ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా నాయకులు, పవన్, చరణ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మేకల మల్లేశ్‌యాదవ్, పాతర్ల గణేశ్, గజవారి గంగాధర్, పుప్పాల పవన్, అమత నరేశ్, గంగాధర్, సీనియర్ నాయకులు సాగర్, ఠాకూర్ సంతోష్‌సింగ్, సురేశ్, మధు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడితో ఉద్రిక్తత

- గన్‌మెన్ దాడిచేశాడని భైంసాలో ఓ వర్గం ఆందోళన

భైంసాటౌన్: భైంసా పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఏఎస్పీ గన్‌మెన్ లాఠీతో ఓ యువకుడిపై దాడిచేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ పర్యవేక్షణలో భాగంగా వెళ్తుండగా, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని బీఫ్‌మార్కెట్ వద్ద స్థానికులు గుమిగూడి ఉన్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఈ క్రమంలో ఏఎస్పీ గన్‌మెన్‌కు, అబు జమీర్ అనే యువకుడి మధ్య వాగ్వాదం జరిగింది. గన్‌మెన్ యువకుడిని లాఠీతో కొట్టాడు. దీంతో ఓవర్గం వారు యువకుడిపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పట్టణ సీఐ ఎల్. శ్రీను అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించారు. అనంతరం యువకుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏఎస్పీ గన్‌మెన్ తనపై దాడి చేశాడంటూ అబు జమీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

విధులకు ఆటంకం కలిగిస్తే కేసులు : ఏఎస్పీ

భైంసా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని, విఘాతం కలిగించేవారిపై చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ సమయంలో ఓ యువకుడు దురుసుగా వ్యవహరించడంతో గన్‌మెన్ దాడి చేశాడని తెలిపారు. ఈ క్రమంలో కొంతమంది గుమికూడి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినవారిని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి ఐకేరెడ్డిని కలిసిన అధికారులు



మంత్రితో బాసర ఆలయ అధికారులు

భైంసా: బాసర ఆలయ అధికారులు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సచివాలయంలోని మంత్రి చాంబర్‌లోకలిసి ఆలయ పునర్నిర్మాణంపై చర్చించినట్లు ఆలయ ఈవో విజయ రామారావు తెలిపారు.

ఖోఖో క్రీడాకారునికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీపీ

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన సాయిరాజ్ నేపాల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఎంపీపీ లలిత రూ.5వేలు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జెడ్ల రాజరాం రూ.5వేలు, అంబేద్కర్ సంఘం నాయకులు రూ.5 వేలు సాయిరాజ్‌కు అందించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాయమోల్ల భోజన్న, సాయన్న, నారాయణ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఇరువర్గాల దాడి

ఇచ్చోడ(బోథ్): మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో 11మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ముదావత్ నైలు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి గాంధీనగర్‌లో దారికి అడ్డంగా వాహనం నిలిపిన సంఘటనలో ఇరువర్గాల మధ్య దాడి జరిగినట్లు తెలిపారు. ఘటనలో షేక్ బాబుమియ, హేక్ ఆరీఫ్, షేక్ అజం, షేక్ కరీం, సర్వటే నందకిషోర్, ముండే వికాస్, ముండే బాలజీ, కాగ్నె గణేశ్, ముండే రాజు, గుట్టె ఆకాశ్, కేంద్రే స్వరూప్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సందర్శించి గ్రామస్తులు సమన్వయం పాటించాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి

జైపూర్(చెన్నూర్): ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన కోరకొప్పుల సతీష్‌గౌడ్ (33)సమీప బంధువైన పులి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం నస్పూర్‌లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో బెల్టుషాపులో మద్యం సేవించి పులి శ్రీనివాస్ పొలంలోని బావి సమీపంలో నిద్రించారు. రాత్రి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. గమనించిన శ్రీనివాస్ వెంటనే మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుని భార్య సంధ్యారాణి తన భర్త మృతి పట్ల పులి శ్రీనివాస్‌పై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.



అసౌకర్యాల నడుమ కొనసాగుతున్న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వార సంత

ఆదాయం ఘనం..
వసతులు శూన్యం

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి వారసంతలు ఎంతగానో ఉపయోగపడుతాయి. ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, పండ్లు వంటి ఉత్పత్తులు లభిస్తాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, చిరు వ్యాపారులు ప్రజలకు అవసరమైన ఉత్పత్తులను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతుంటారు. కొన్నిచోట్ల మేకలు, గొర్రెలు, పశువులు వంటి జీవాలను విక్రయిస్తుంటారు. ఇలాంటి వారసంతల నిర్వహణకు గ్రామ పంచాయతీలు వేలం నిర్వహిస్తుంటాయి. తద్వారా వాటికి ఏటా లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. సంతల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల కల్పించడంలో పాలకవర్గాలు, అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం.

- వారసంతల్లో కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని పంచాయతీ పాలకవర్గాలు
- విక్రయదారులు, కొనుగోలుదారులకు తప్పని తిప్పలు

ప్రతీ మండలంలో వారసంత

జిల్లాలోని 17 మండలాల్లో ప్రతి వారం వారం సంతలు జరుగుతూనే ఉంటాయి. ఒక్కో మండలంలో ఒక్కో రోజున పశువుల సంత, దినసరి, వారసంతలను నిర్వహిస్తుంటారు. ఈ సంతలకు ఆయా ప్రాంతాల సమీపంలోని గ్రామాల రైతులు వారు పండించిన కూరగాయలు, పండ్లు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కొంతమంది చిరు వ్యాపారులు ప్రజలకు అవసరమైన అన్ని రకాల వస్తువులను దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తుంటారు. రైతులు, కొనుగోలుదారుల సౌకర్యార్థం కొన్ని మండలాల్లో పశువులు, మేకలు, గొర్రెల విక్రయాలు సైతం సాగుతుంటాయి. ఇందుకు ఇచ్చోడ వారసంతా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సంతల్లో విక్రయాలు సాగించే రైతులు, వ్యాపారులు సంబంధిత గ్రామ పంచాయతీ వేలం ద్వారా నిర్దేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, బేల, ఉట్నూర్, ఇంద్రవెల్లి, భీంపూర్, బోథ్, గుడిహత్నూర్, నార్నూర్, సుంకిడి, సాంగిడి, సాంగ్వీ, నేరడిగొండ, భీంపూర్ తదితర ప్రాంతాల్లో వార సంతలను నిర్వహిస్తున్నారు. ఇచ్చోడ, బేల, ఉట్నూర్ ఎక్స్‌రోడ్, సుంకిడి, సాంగిడి గ్రామాల్లో పశువుల సంతలున్నాయి. ప్రతి వారం ఈ సంతల్లో లక్షలాది రూపాయల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా ఆయా పంచాయతీలకు యేటా లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అన్ని రకాల సంతలకు కలిపి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.50 నుంచి రూ.70లక్షల ఆదాయం సమకూరుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

తప్పని తిప్పలు

సంతలను నిర్వహించే గ్రామ పంచాయతీలు వాటి ద్వారా లక్షల రూపాయల ఆదాయం ఆర్జిస్తున్నప్పటికీ సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించడం లేదు. గూడారాలు, చెట్లకిందనే చిరు వ్యాపారులు విక్రయాలు సాగిస్తుంటారు. దీంతో ఎండకు, వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షకాలంలోనైతే చాలా ప్రాంతాల్లో సంతలు బురదతో నిండి నడవడానికి సైతం వీల్లేని పరిస్థితి. కొనుగోలు కోసం వచ్చిన ప్రజలు బురదలో ఇబ్బందులు పడుతూ కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ముఖ్యంగా టాయిలెట్స్, తాగునీరు వంటి వసతుల్లేక నానా తిప్పలు పడుతున్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదు



సంతలో కూరగాయలను విక్రయించే తమ నుంచి ప్రతి వారం ముక్కుపిండి మరీ రుసుం వసూలు చేస్తున్న అధికారులు మాకు అవసరమైన సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. సుంకిడి, భీంపూర్ మండల్లాలోని సంతల్లోనే కాదు జిల్లాలోని అన్ని సంతల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునేందుకు ఉన్న శ్రద్ధ మా సమస్యలపై లేకపోవడం విచారకరం.

– సుధాకర్, సుంకిడి, చిరువ్యాపారి

సౌకర్యాల్లేక ఇబ్బందులు



ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే వారసంతలో పదేళ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నాను. ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను విక్రయిస్తున్నాను. సంతలో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం తాగునీరు, టాయిలెట్స్ వంటి వసతులు సైతం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యాపారులే కాదు సంతకు వచ్చే కొనుగోలుదారులు సైతం తంటాలు పడాల్సి వస్తోంది.

– షేక్ ఇషామొద్దీన్, జైనూర్, వ్యాపారి

ఆపన్నహస్తం అందించరూ..



చికిత్స పొందుతున్న రాజేశ్

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజేశ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇప్పటివరకు సుమారు రూ.10లక్షలు అప్పుచేసి నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్‌లలో చికిత్స అందించామని, ప్రస్తుతం పూర్తిస్థాయి చికిత్సకు మరో రూ.5లక్షలు అందితే తప్ప బతికే అవకాశం లేదని డాక్టర్లు చెప్పారని కుటుంబసభ్యులు వాపోయారు. ఇప్పటికే ఉన్న ఇంటిని సైతం అమ్ముకుని అప్పుల్లో కూరుకుపోయామని, ఎవరైనా దాతలు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాలనుకునే దాతలు యూనియన్ బ్యాంక్ ఖాతా నంబర్ 213212010003125, ఐఎఫ్‌సీఎస్ యూబీఐఎన్0821322, ఫోన్ పే నంబర్ 8184886605కు సాయం అందించాలని కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తాండూర్: కిష్టంపేట పంచాయతీ పరిధిలోని తాండూర్ బస్టాప్ సమీపంలో ఉన్న చిలుముల శ్రీధర్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. శ్రీధర్ ఈ నెల 16న జమ్మికుంటలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. బట్టలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రాజశేఖర్, డాగ్‌స్వాడ్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లింట పట్టపగలే చోరీ

- రూ.5 లక్షల సొత్తు అపహరణ



తెరిచి ఉన్న బీరువా తలుపులు

బజార్‌హత్నూర్(బోథ్): మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న చట్ల మధుకర్ ఇంట్లో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానిక ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం మధుకర్ చిన్నకూతురు వివాహం ఈ నెల 14న బోథ్‌లో జరిగింది. బుధవారం కుటుంబ సభ్యులంతా కలిసి ఇంటికి తాళం వేసి అడెల్లి పోచమ్మ ఆలయానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచిఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో పరిశీలించగా లాకర్‌లో ఉన్న 5.5 తులాల బంగారు గొలుసు, 2 మాసాల కమ్మలు, రూ.1.40 లక్షల నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం పోలీస్ క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకుని ఫింగర్ ప్రింట్ సేకరించారు. రూ.5 లక్షల సొత్తు దొంగిలించినట్లు బాధిత కుటుంబం వాపోయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్టులో చోరీకి యత్నించిన నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్: జిల్లా కోర్టు ప్రాంగణంలోని ప్రాపర్టీ రూమ్‌లో చోరీకి యత్నించిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఉమేందర్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.80 వేల విలువైన రాగి తీగలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కోర్టులో ఔట్ సోర్సింగ్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ షబ్బీర్ సాయంతో ఏప్రిల్ 29న రాత్రి ఇప్ప పరమేశ్వర్, మిరియాలవార్ శ్రీనివాస్ కోర్టు ప్రాపర్టీ రూమ్‌లో ఉన్న రాగి తీగలు, ఇతర సామగ్రి దొంగిలించారన్నారు. అనంతరం ఇప్ప రాజేశ్వర్, మిరియాలవార్ సంతోష్, మాలికర్ గజానంద్‌లతో కలిసి మహమ్మద్ రఫీకి రాగి తీగలను విక్రయించారన్నారు. విక్రయించగా వచ్చిన సొమ్ములో రూ.30 వేలు షబ్బీర్‌కు ఇచ్చినట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని రైలు పట్టాల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద బ్యాగులో 20 కిలోల వరకు రాగి తీగలు ఉన్నట్లు గుర్తించి విచారించగా కోర్టు ప్రాంగణంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో టూ టౌన్ సీఐ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



చెరువు వద్ద ఉన్న ప్లాస్టిక్ వస్తువులను స్వయంగా తీస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్లాస్టిక్‌ను చాలా తక్కువగా వాడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతపేట్‌లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామ చెరువులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయొద్దని సూచించారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం చెరువు సమీపంలోని చెత్త చెదారం పాలిథిన్ కవర్లను కలెక్టర్ స్వయంగా తొలగించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తర్వాత గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో సాయిరాం, నాయకులు అశోక్, ఏపీవో తుల రామకృష్ణ ఉన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

ఆరోగ్యం... ఆహ్లాదం



అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన రోగులు మరింత ఆవేదనకు గురికాకుండా వారికి ఆహ్లాదం అందించేలా రిమ్స్ ఆస్పత్రి సిబ్బంది చేసిన ప్రయత్నం ఆకర్షిస్తోంది. ఆస్పత్రిలోని ఐసీయూ వార్డులో చల్లదనంతో పాటు ఆహ్లాదం కల్పించేలా మనీ ప్లాంట్లను ఏర్పాటు చేసి పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అ'పూర్వ' సమ్మేళనం



నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1999, 2000, 2001 బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొని గత స్మృతులు గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పటి గురువులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటీ, నూకల నందకుమార్, సుబ్రమణ్యశర్మ, విద్యాసాగర్, రామారావు, గంగాధర్, నీరడి గంగాశంకర్, డానియల్, పూర్వ విద్యార్థినులు కవిత, సమత, సునీత, అంజమ్మ, కె.సంధ్యారాణి, వై.స్వప్న, పద్మజ, తారకల, రాణి, పోసక్క, శ్రుతిమ, తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో గుర్తు తెలియని మృతదేహం

సారంగాపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని నీటిసంపులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. సారంగాపూర్ కారోబార్ ఉమామహేశ్వర్, గ్రామ పంచాయతీ వర్కర్ తోఫిక్ మార్కెట్ యార్డు ఆవరణలో తిరుగుతుండగా దుర్వాసన రావడంతో అటుగా వెళ్లి సంపులో చూడగా వ్యక్తి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కారోబార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతుని వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండవచ్చని ఎస్సై తెలిపారు.

తునికాకు కూలీకి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

వేమనపల్లి(బెల్లంపల్లి): తునికాకు సేకరణకు వెళ్లిన ముల్కలపేట గ్రామానికి చెందిన ఎల్కరి శ్రీనివాస్ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం తునికాకు సేకరణకోసం గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి వెళ్లాడు. చెట్టు ఎక్కి ఆకు తెంపుతుండగా పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైరు తాకడంతో షాక్‌కు గురై కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు గమనించి ఇంటికి తీసుకువచ్చారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి అదృశ్యం



కట్ల గౌరయ్య (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కట్ల గౌరయ్య ఈ నెల 16న అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. 16న సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గౌరయ్య రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో అతని భార్య కళావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గౌరయ్య ఆచూకీ తెలిసినవారు తాండూర్ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

ప్రాజెక్టుల సందర్శన



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కడెం/మామడ/సారంగాపూర్: జిల్లాలోని మూడు ప్రధాన ప్రాజెక్టులను కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కడెం మండలంలోని కడెం ప్రాజెక్టు, మామడ మండలం పొన్కల్ వద్ద గోదావరిపై నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును, ఖానాపూర్ మండలం మేడంపల్లిలోని సదర్మాట్ ఆనకట్టను సందర్శించారు. మరమ్మతు, నిర్మాణం, నిర్వహణ పనుల పురోగతి, ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టుకు గతేడాది వచ్చిన విపత్తు గురించి ఆరా తీశారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్వర్ణ ప్రాజెక్టు ప్రధాన కాలువల వివరాలతోపాటు ప్రస్తుతం మధ్యకాలువ(జౌళినాళ)కు చేపడుతున్న మరమ్మతు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్ల పరిస్థితి గురించి ఆరా తీశారు. మధ్యకాలువ షట్టర్ మొరాయిస్తుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. రూ.5 లక్షలతో షట్టర్‌కు మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట డీఈ భోజ దాసు, నీటిపారుదలశాఖ ఈఈ రామారావు, ఏఈ మధుపాల్, ఏఈఈ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ ఆరిఫా, ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఉన్నారు.



బ్యారేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సదర్మాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



ప్రాజెక్టు పరిస్థితిని గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి